డేంజర్ జోన్‌లో చెరువు కరకట్ట

- గత ఏడాది కోతకు గురి
- ప్రస్తుతం నిండుకుని ప్రమాదంలో ఉన్న పెద్దసముద్రం చెరువు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు


కోతకు గురైన పెద్ద సముద్రం చెరువు కరకట్ట

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బావోజిగూడెం గ్రామశివారు పెద్ద చెరువు కరకట్ట డేంజర్ జోన్‌లో ఉంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలకు చెరువు పొంగిపొర్లింది. దీంతో వరద ధాటికి చెరువు కరకట్ట పొడవున భారీగా కోతకు గురైంది. మరిపెడ మండల కేంద్రం నుంచి వయా గిరిపురం, వెంకంపాడు, బావోజిగూడెం, రాంపురం గ్రామానికి ఆర్‌అండ్‌బీ రహదారి ఇదే చెరువు కరకట్ట మీదుగా నిర్మించి ఉంది. మధ్యలో ఉన్న బావోజిగూడెం గ్రామ శివారు పెద్ద సముద్రం కరకట్టపై రహదారి కూడా వరద దాటికి ధ్వంసమైంది. ఈ రహదారి గుండా ప్రయాణించే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఏడాదిగా కరకట్ట మరమ్మతులు చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఏడాదిగా అలసత్వం..

గత ఏడాది ఇదే సెప్టెంబర్ నెలలో పెద్ద సముద్రం చెరువు కరకట్ట వరదకు ధ్వంసమైంది. అదే ఏడాది మండల ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టి జరిగిన నష్టాన్ని అంచన వేశారు. ఏప్రిల్, మే నెలలో కరకట్ట మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కానీ అధికారుల అలసత్వం కారణంగా ఇప్పటి వరకు ధ్వంసమైన చెరువు కరకట్టకు ఎలాంటి పురోగతి లేదు. వరద కారణంగా చెరువు కట్ట మట్టి కొట్టుకుని పోయి కింద పొలాల్లో మేటలు పెట్టడంతో రైతులు సాగు చేసుకోలేక వదిలేయాల్సిన దుస్థితి చోటుచేసుకుంది. చెరువు కరకట్ట రహదారి వెంట ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ, కేబుల్ వైర్లు బయటకు తేలి ఉన్నాయి.

గ్రామస్తుల ఆందోళన..

ప్రమాదకరపు అంచుల్లో పెద్దసముద్రం చెరువు కరకట్ట ఉండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా చెరువు నిండుకుంది. దీంతో కరకట్ట ఎప్పుడు తెగి ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కరకట్టకు గండిపడితే కింద పొలాలు అన్ని కొట్టుకు పోయే అవకాశం ఉందని రైతులు మరో పక్క దిగులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతస్థాయి ఇరిగేషన్ అధికారులు స్పందించి తక్షణమే బావోజిగూడెం పెద్ద సముద్రం చెరువు కరకట్ట మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులతోపాటు పలు వాహన దారులు డిమాండ్ చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



గత ఏడాది సెప్టెంబర్ నెలలో కోతకు గురై కొన పట్టుమీద ఉన్న పెద్దసముద్రం చెరువు కట్ట మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదం పొంది ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువు నిండుకుంది. చెరువు కట్ట ఒత్తిడికి గురై తెగిపోయే ప్రమాదం ఉంది. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– దిగజర్ల భావనరుషి, రైతు, బావోజిగూడెం


కేసీఆర్ దూరదృష్టితో చెరువులకు జలకళ


మత్తడి వద్ద పూజలు చేస్తున్న నాయకులు

తొర్రూరు: కేసీఆర్ దూరదృష్టితో చెరువులను పునరుద్ధరించడంతో జలకళ సంతరించుకుంటున్నాయని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కర్నె సోమయ్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక పెద్ద చెరువు మత్తడి పోస్తుండడంతో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పూజలు చేశారు. గంగమ్మకు కుంకుమ, పసుపు, సారె సమర్పించారు. సోమయ్య మాట్లాడుతూ.. మిషన్ కాకతీయ పథకంతో గతంలో కేసీఆర్ చెరువులను మరమ్మతు చేయడంతో వర్షపు నీరు నిలిచి రైతులు ఆనందంగా పంటలు పండించుకుంటున్నట్లు తెలిపారు. ఎరువులు ఇవ్వక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గోసపెడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, నలమాస ప్రమోద్, కర్నె నాగరాజు, ధరావత్ జైసింగ్, రాయిశెట్టి వెంకన్న, జంపా, ఆశయ్య పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


డోర్నకల్: గొల్లచర్లలో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బయ్యారం: గంధంపల్లి-కొత్తపేటలో బాలత్రిపుర సుందరదేవి అలంకరణలో దుర్గామాత


గార్ల: వర్తకసంఘం భవనంలో..


గూడూరు: దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు


కురవి వీరన్న సన్నిధిలో..


కేసముద్రం: అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా దుర్గామాత విగ్రహాలను సోమవారం ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందించారు. పలువురు దుర్గామాత మాలలు ధరించారు. – సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

వైద్యుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

గార్ల: గార్లలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో స్పెషలిస్ట్ వైద్యుల ఖాళీలను వెంటనే భర్తీ చేసి మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సత్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ స్పందించి ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యులను వెంటనే భర్తీ చేయించాలని, లేనిఎడల పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వీరభద్రం, భద్రయ్య, మనోహర్, మాన్యా, గణేష్, బాబూరావు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌పీ జిల్లా కన్వీనర్‌గా సైదులు



మరిపెడ: ఎఫ్‌ఎల్‌పీ (ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్) కమిటీ జిల్లా కన్వీనర్‌గా మరిపెడకు చెందిన న్యాయవాది తునుకునూరి సైదులు నియామకం అయ్యాడు. ఎఫ్‌ఎల్‌పీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్ చౌదరి నియామక పత్రం అందజేశారు.

తల్లి మృతిపై కుమారుడి ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి జరిగిన సైదాబేగం మృతికి గల కారణాలపై విచారణ జరపాలని కోరుతూ ఆమె కుమారుడు షేక్ రఫీ ఫిర్యాదు చేశాడని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. జిల్లాలోని సీరోలు మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన సైదాబేగంకు షుగర్ పెరిగిందని వైద్య పరీక్షల కోసం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చారన్నారు. ఈక్రమంలో ఆమె మృతి చెందగా తన తల్లి చావుకు గల కారణాలు తెలుసుకోవాలని కోరుతూ కుమారుడు రఫీ ఫిర్యాదు చేశాడన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్



నెల్లికుదురు: విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సోమవారం బాలబాలికల 44వ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ షూటింగ్ బాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ అయిలయ్య, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ జిత్‌రాజ్ కుమార్, ఎంఈఓ రాందాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని పాడిగేదె మృతి

గూడూరు: రోడ్డుపై వెళ్తున్న పాడిగేదెను అటుగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం జరిగింది. వివరాల ప్రకారం మండలంలోని బొడ్డుగొండ గ్రామానికి చెందిన పాడి గేదెలను కాపరి అడవిలో మేపుకొని సాయంత్రం ఇంటికి వెళ్తున్నాడు. జగన్నాయకులగూడెం క్రాస్ రోడ్డుకు కొద్ది దూరంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు పాడి గేదెను ఢీకొట్టింది. గేదె అక్కడికక్కడే మృతి చెందింది. కారు అద్దం పగిలి, డేంజర్ బ్యాగ్‌లు ఓపెన్ అయ్యాయి. కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తితో పాటు మరొకరు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

దత్తత తీసుకోవాలి

గార్ల: గార్లలోని పుట్టకోట బజారులో అత్యంత పేదరికంలో ఉన్న మన్న ప్రసాద్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యింది. ఇట్టి ఇల్లు నిర్మాణానికి తొలుత పెట్టుబడి పెట్టే స్థోమత అతనికి లేదని, కలెక్టర్ దత్తత తీసుకుని ఇల్లు నిర్మించాలని ప్రముఖ న్యాయవాది జంపాల విశ్వ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు వచ్చి ఇంటికి ముగ్గులు పోసి వెళ్లిపోయారన్నారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని ఉన్న పెంకుటిళ్లను కూలగొట్టాడు. ప్రస్తుతం ఇల్లు లేకపోవడంతో నాలుగు రేకులు వేసుకొని చుట్టూ దేరాలు కట్టుకొని నివసిస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి కసరత్తు

దంతాలపల్లి: మండలంలోని వివిధ గిరిజన తెగల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ఎంఈఓ శ్రీదేవి సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గిరిజనుల అభివృద్ధి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి నివేదిక తయారు చేస్తుందన్నారు. ఈ నివేదికలో ఆయా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఏడు శాఖల సమన్వయంతో చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్ పాషా, అధికారులు పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ చేయాలి


ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

తొర్రూరు: ప్రతీ ఒక్క రైతుకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల పైన రుణం ఉన్నా రుణమాఫీ వర్తింపజేయాలని రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు తమ్మెర విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతిలతో కలిసి విశ్వేశ్వరరావు మాట్లాడారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని, కానీ మాజీ ఎంపీ సుబ్బిరామిరెడ్డికి మాత్రం రూ.5,700కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. ధనవంతులకు రుణమాఫీ చేస్తూ పేద రైతులను విస్మరించడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణపురం లక్ష్మణ్, బూరుగు యాదగిరి, శ్యాం సుందర్, ముద్రబోయిన వెంకన్న, అజ్మీర వీరన్న, యాకయ్య పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

గూడూరు: అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారంతో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ కళావతి అన్నారు. మండలంలోని మర్రిమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసోత్సవం సందర్భంగా గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు పార్వతి, జక్కుల మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

బయ్యారం: ఈనెల 28 న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీని జయప్రదం చేయాలని లంబాడ జేఏసీ ఉద్యోగ సంఘం నాయకులు అజ్మీర కోటేశ్వరరావునాయక్ పిలుపునిచ్చారు. సోమవారం బయ్యారంలో నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రవినాయక్, శ్రీనివాస్‌నాయక్, రమేష్, రూప్లా పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర ప్రకటించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గంగారం: కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర రూ.10,075లు ప్రకటించి, కొనుగోలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ అన్నారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమెరికా, ఇంగ్లాండ్ దేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల పత్తికి దిగుమతిపై 11శాతం సుంకాన్ని రద్దు చేశారని, దీంతో పత్తి రైతులకు ఉరితాడులా మారుతుందన్నారు. ఇప్పటికే పత్తి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే విదేశాల నుంచి పత్తి దిగుమతులు పెరిగితే రైతాంగం మరింత సంక్షోభంలోకి కూరుకపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జజ్జరీ రాము, సిద్దబోయిన రాము, జజ్జర సురేందర్, లక్ష్మయ్య, వెంకటయ్య, పూనెం రవికుమార్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి


మాట్లాడుతున్న రాజయ్య


తొర్రూరు: డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసి పేదల సొంతింటి కల నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజయ్య కోరారు. డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిరసన కార్యక్రమాలు సోమవారం కొనసాగాయి. రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీపై స్పష్టత ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఇళ్లను నిరుపయోగంగా మార్చడం సరికాదని, పంపిణీపై స్పష్టతనివ్వకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్, పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య, పార్టీ నాయకులు దొనుకదర్గయ్య, జమ్ముల శ్రీనివాస్, ఎండీ నజీర్, తిమ్మిడి రవి, మల్లయ్య, సాయిలు, ధర్మయ్య పాల్గొన్నారు.

పట్టాలు అడిగినందుకు రైతులపై కేసులు


మాట్లాడుతున్న ధరావత్ రవి, పాల్గొన్న రైతులు

మహబూబాబాద్ రూరల్: ఎంజాయిమెంట్ సర్వే ప్రకారం భూమి హక్కు పత్రాలు ఇవ్వాలంటూ రాస్తారోకో నిర్వహిస్తే పోలీసులు కేసులు నమోదు చేశారని కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు నమోదైన రైతులు మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో సోమవారం విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈసందర్భంగా నారాయణపురం గ్రామ మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి మాట్లాడుతూ.. ఎంజాయిమెంట్ సర్వే ప్రకారం భూమి హక్కు పత్రాలు ఇవ్వాలంటూ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై నారాయణపురం గ్రామ రైతులు రాస్తారోకో నిర్వహించారన్నారు. ఈ సంఘటనలో పోలీసులు, అధికారుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంటూ 36మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నారాయణపురం రైతులకు పట్టాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించినా ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదికర్మ యోగి అభియాన్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఫారెస్టు అధికారి చిట్టిబాబు

గూడూరు: ఆదికర్మ యోగి అభియాన్ పథకంతో ఆదివాసీలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఫారెస్టు శాఖ అధికారి చిట్టిబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆదికర్మ యోగి అభియాన్‌పై పలు శాఖలకు చెందిన ఉద్యోగులకు మొదటి రోజు అవగాహన సదస్సు ప్రారంభంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో మండలంలో 12 గ్రామాలు ఎంపిక అయ్యాయని, గ్రామస్థాయిలో పనిచేసే వివిధ శాఖల అధికారులు సమష్టిగా ముందుకు సాగి తండాల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ జె. రవికుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, ఏపీఎం వీరయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరం



డోర్నకల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశాఖలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు నూతక్కి దివ్య, కళ్లెం జోత్స్న, కె.రాజ్‌కుమార్, వి.సతీష్, అపూర్వ, బి.శ్రీశైలం, మేఘన, ప్రియాంక ఆధ్వర్యంలో సుమారు 190 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు.

అభినందనీయం

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాసేవ కార్యక్రమాలను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్స్ చేపట్టడం అభినందనీయమని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్లకొండ కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో సమత డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి బరిగెల నారాయణ, పంచాయతీ కార్యదర్శి అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు భిక్ష

కురవి: మండల కేంద్రంలో దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా భక్తులు కనకదుర్గమ్మ మాలను ధరించారు. సోమవారం పూజల అనంతరం అమ్మవారి మాలధరించిన స్వాములకు సిరసాని వీరన్న-కాశేశ్వరీ దంపతులు భిక్ష అందజేశారు.

మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

కొత్తగూడ: మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు చేసి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.12కోట్లు నిధులు కేటాయిస్తూ మంత్రి వర్గం ఆమోదం తెలిపినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, వెంకటరెడ్డిల చిత్రపటాలనికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈజీఎస్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, నాయకులు వెంకటేశ్వర్ రావు, మొగిలి, రూప్‌సింగ్, రంజిత్, రణధీర్, తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పోటు వరమ్మ(90) కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఉయ్యాలవాడకు చెందిన వరమ్మ పది రోజుల క్రితం ఇంటి ముందు చెత్త తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కేసముద్రం: విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని భూక్యారాం తండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన రైతు భూక్య రాములు తన ఇంటి ఆవరణంలోని కొట్టంలో ఎప్పటిలాగే పశువులను కట్టేశాడు. కొట్టంలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉన్న విద్యుత్ తీగ తెగి పశుగ్రాసంలో పండింది. పశుగ్రాసం తింటున్న ఎద్దు విద్యుత్‌కు షాక్ గురై అక్కడికక్కడే ఎద్దు మృతి చెందింది.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చిన్నగూడూరు: ఆపదలో ఉన్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని పది గ్రామపంచాయతీలకు సంబంధించిన సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 8.41లక్షల విలువైన చెక్కులను ఆయా గ్రామాల గ్రామ అధ్యక్షులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాయకులు బిక్కు నాయక్, నగేష్, రవి కిరణ్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు

తొర్రూరు రూరల్: మండలంలోని క్రిష్టపురం గ్రామానికి చెందిన ఆశ వర్కర్ గూడెల్లి ఇందిర, రవికుమార్ దంపతుల కుమారుడు రఘువంశీ రాష్ట్రస్థాయిలో 415 మార్కులతోపాటు 3618 ర్యాంక్‌ను సాధించి, ఎంబీబీఎస్‌లో నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందాడు.

కార్యకర్తల కుటుంబాలకు కాపాడుకుంటాం..

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం పని చేసి అనేక కారణాలతో మరణించిన కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటానాని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఉమ్మగాని పద్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాసర్ల రంగయ్య అన్నారు. సోమవారం మండలంలోని గుర్తూరులో ఇటీవల మృతి చెందిన మూడు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, బియ్యం అందించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, చందర్, అశోక్, భిక్షపతి, వెంకన్న, సత్యం పాల్గొన్నారు..

అర్హులందరికీ బతుకమ్మ చీరలు అందించాలి

కేసముద్రం: అర్హులైన మహిళలందరికీ బతుకమ్మ చీరలను అందజేయాలంటూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ వివేక్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమలలో మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, వెంకటాచారి పాల్గొన్నారు.

భవానిమాత మాలధారణ స్వీకరణ

మహబూబాబాద్ రూరల్: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీమహాగాయత్రీ దేవాలయంలో 300మంది భక్తులు భవాని దీక్ష మాలధారణ స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు, వంకోజు పూర్ణానందాచార్యులు ఆధ్వర్యంలో భక్తులకు భవాని మాలధారణ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డోర్నకల్: స్థానిక 13వ వార్డులో సోమవారం మృతి చెందిన పోటు వరమ్మ(90) మృతికి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సంతాపం తెలిపారు. 13వ మాజీ వార్డు సభ్యులు పోటు జనార్ధన్, మాజీ మజ్దూర్ యూనియర్ నాయకులు పోటు వెంకటరమణ తల్లి వర్మ అనారోగ్యంతో మృతి చెందగా రెడ్యానాయక్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు చేరెడ్డి బిక్షంరెడ్డి, కత్తెరసాల విద్యాసాగర్, పాండునాయక్, తదితరులు సంతాపం తెలిపారు.

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మహమ్మద్ అఫ్జల్‌బీ కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఖమ్మం క్యూర్ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాజీ ఎంపీటీసీ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ అనితాదేవి

మరిపెడ రూరల్: కేంద్ర ప్రభుత్వం నుంచి అమలయ్యే పథకాలను గిరిజనులకు అందించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంఈఓ అనితాదేవి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బ్లాక్ మాస్టర్ ట్రైనర్ ఆధ్వర్యంలో 'ఆది కర్మయోగి అభియాన్' పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అర్హులైన గిరిజనులను గుర్తించి వారికి ప్రయోజనం కలిగించే పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి గుగులోతు రవి, మిషన్ భగిరథ ఏఈ హతిరాం, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, ఏపీఎం మంగ పాల్గొన్నారు.